# ఇరాన్‌ను లోబరుచుకోడానికి

# అమెరికా, ఇతర సామ్రాజ్యవాదుల బెదిరింపులు




**ఇరాన్** ఆణు ఒప్పందం నుండి అమెరికా సామ్రాజ్యవాదం వైదొలుగుతున్నట్లు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. ఇరాన్‌ను బలహీనపరిచేందుకు తిరిగి ఆర్థిక ఆంక్షలు విధిస్తున్నట్లు, త్వరలోనే మరికొన్ని అప్రకటిత ఆంక్షలు విధించబోతున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. ప్రపంచంలోనే తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న ప్రధాన దేశంగా ఇరాన్‌పై ఆరోపణలు చేశాడు. ఇరాన్ అమెరికాను అణ్వాయుధ క్షిపణితో గురిపెట్టి బెదిరిస్తున్నట్లు ఆరోపించాడు.

ఇవన్నీ ఘోర అవాస్తవాలు. అమెరికా సామ్రాజ్యవాదం ఇరాన్‌పై తీసుకోబోతున్న దురాక్రమణపూరిత చర్యలకు మద్దతు కూడగట్టు కోవడానికి అమెరికా ప్రజలను, ప్రపంచాన్ని నమ్మించడానికి చెప్తున్న ఘోరమైన అబద్ధాలు.

ఎవరు ఎవరిని బెదిరిస్తున్నారు? ఇరాన్ చుట్టూ 45 అమెరికా మిలటరీ స్థావరాలు కన్పిస్తాయి. అక్కడ నుండి ఆదేశాలందిన కొన్ని నిముషాల్లోనే ఇరాన్‌పై దాడులు ప్రారంభించవచ్చు. 105 క్రూయిజ్ క్షిపణులు మోహరించిన విషయం, ఏప్రియల్‌లో 14 సార్లు సిరియాపై దాడిచేసిన విషయం దాచేస్తే దాగని సత్యం. ఈ 105 క్షిపణులలో అమెరికా 85, ఫ్రాన్స్ 12, యు.కె. 8 మిస్సైళ్ళను ప్రయోగించాయి. హమాస్ స్థావరంపై ఇజ్రాయిల్ చేసిన మిస్సైల్ దాడికి 20 మంది ప్రజలు చనిపోయారు. 60 మంది గాయపడ్డారు. దాని తీవ్రత 2.6 తీవ్రతతో సంభవించిన భూకంపంతో సమానం. దీనివల్ల ఏర్పడిన ప్రకంపనలు లెబనాన్, టర్కీ వరకు వ్యాపించాయి. ఇన్ని చేస్తున్న అమెరికా, దాని మిత్ర దేశం ఇజ్రాయిల్‌లు మాత్రమే ఇరాన్, సిరియాలకే కాకుండా మొత్తం మధ్య ఆసియాకు నిజమైన పెనుముప్పు.

ఇరాన్ నుండి అణుప్రమాదం వుందనడం కూడా అబద్ధమే. అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఎఇఎ)ఇరాన్ అణుశక్తి పరీక్షా కేంద్రాలను అత్యంత అవమానకర రీతిలో తనిఖీ చేసి, ఆ ఒప్పందంలోని భాగస్వాములందరితో నిశితంగా మాట్లాడిన పిమ్మట ఇరాన్ ఆ ఒప్పందంమేరకు తన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించిందనీ, కనీసం మరో 15 సంవత్సరాల వరకు అణ్వాయుధ కార్యక్రమాలను చేపట్టలేదనీ పేర్కొంది. దానికి విరుద్ధంగా అమెరికా సైన్యం 7000 అణ్వాయుధాలను వుంచుకుంది. 2017 నాటికి తను 1411 న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను, 673 ఐసిబిఎంలు, ఎస్‌ఎల్‌బిఎంలతో ప్రపంచవ్యాప్తంగా కీలక బాంబర్లపై మోహరించినట్లు పెంటగన్ ప్రకటించింది. దీన్నిబట్టి చూస్తే నిజమైన అణుముప్పు కేవలం అమెరికా సామ్రాజ్యవాదం నుండి మాత్రమే వుందని తెలుస్తుంది.

అమెరికా సామ్రాజ్యవాదం తన ఆధిపత్య ప్రయోజనాలను నెరవేర్చుకునే క్రమంలో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల నుండి సిరియా, యెమెన్ వరకు ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ప్రేరేపించి పెంచిపోషించింది. గత 25 సం॥లుగా మధ్య ఆసియా దేశాలలోని సమాజాలను, ప్రజల జీవితాలను ఛిద్రం చేసింది. అన్నిరకాల తీవ్రవాదాలను ప్రేరేపించి, నేటికీ ప్రేరేపిస్తూ మధ్యప్రాచ్య దేశాలను సర్వనాశనం చేస్తున్నది అమెరికా సామ్రాజ్యవాదమే. పైగా ఈ అమెరికా సామ్రాజ్యవాదమే తీవ్రవాదాన్ని ప్రేరేపించడంలో తనతోబాటు నిలవడానికి అంగీకరించని దేశాలను తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న రాజ్యాలుగా ఆరోపిస్తుంది.

అమెరికా మీడియా ఇరాన్‌లోని మత పరిపాలన గురించి దుయ్యబడ్తూ ఇరాన్ రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా మతపరమైన అసహనాన్ని ఆపాదిస్తోంది. వీరిలో ఎక్కువమంది ముస్లిం మత పెద్దలు – డోనాల్డ్ ట్రంప్, పదవీచ్యుతుడైన ఇరాన్ అధిపతి షాల గురించి స్తోత్ర పాటలు పాడుతున్నారు. షా పరిపాలనలో ఇరాన్ అంతర్జాతీయ సమాజం నుండి గౌరవ మర్యాదలు పొందిందని ట్రంప్ అంటున్నాడు. ఈ విషయం అమెరికా సామ్రాజ్యవాదం యొక్క అసలు ఉద్దేశ్యమేమిటో తెలియచేస్తోంది.

1951 నుండి ఇరాన్‌లో ఎన్నికైన ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వంపై విషం చిమ్ముతోంది. ఆ సంవత్సరం మొహమ్మద్

మొసాదెహ్ ప్రభుత్వం చమురు వనరులన్నిటినీ జాతీయంచేసి ఆ వనరులను ఆంగ్లో అమెరికన్ కంపెనీల నుండి విముక్తి చేసింది. రెండేళ్ల తర్వాత మొసాదెహ్‌ను సి.ఐ.ఎ. సాయుధ తిరుగుబాటుతో పదవీచ్యుతుడ్ని చేసింది. అమెరికా సామ్రాజ్యవాదం షా రిజా పహ్లావిని అధికారంలో ప్రతిష్టించింది. వెంటనే షా చమురు కంపెనీల జాతీయకరణను రద్దుచేసి, అమెరికన్ కంపెనీలకు మార్గం సుగుమం చేశాడు. ఈ కుట్రను అమలు చేసిన, వాస్తవానికి టెహరాన్‌కు యుద్ధ టాంకర్‌పై విచ్చేసిన సి.ఐ.ఎ. ప్రతినిధి కెర్మిట్ రూజ్‌వెల్ట్ జూనియర్, ఆ తర్వాత ఈయన గల్ఫ్ ఆయిల్ కంపెనీకి కార్యనిర్వాహక అధికారి అయ్యాడు. ఆ తర్వాత 1979లో జరిగిన ఇరాన్ విప్లవం కారణంగా షా పహ్లావి దేశం విడిచి పారిపోయాడు. ఇరాన్ గణతంత్రరాజ్యంగా ఏర్పడింది. ఈ ప్రభుత్వం తిరిగి చమురు రంగాన్ని జాతీయం చేసింది.

మధ్య ఆసియాలోని సహజవనరైన చమురుపై తిరుగులేని అధికారం కావాలనే కోరిక, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఇరాన్ అణుఒప్పందం నుండి ఉపసంహరించుకునేలా చేసింది. సంయుక్త సమగ్ర కార్యాచరణ పథకం(జెసిపిఒఎ)గా పిలువబడే ఇరాన్ ఒప్పందంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యులు (అమెరికా, ఫ్రాన్స్, యు.కె., రష్యా మరియు చైనా) మరియు జర్మనీ, 2015లో ఐరోపా యూనియన్ సంతకం చేశాయి. ఈ ఇరాన్ ఒప్పందం నుండి అమెరికా తప్పుకోవడం మిగిలిన ఒప్పంద దేశాలకు కోపం తెప్పించిందనే విషయంలో సందేహంలేదు. 'అసలు లావాదేవీలో లేకుండా వుండేకంటే లావాదేవీలో వుండడం మేలు. ఘర్షణ కంటే చర్చలు మేలు' అని చైనా స్పందించింది. అమెరికా బయటకు వెళ్ళినా ఆ ఒప్పందం అమలయ్యేట్లు చూస్తానని రష్యా ప్రకటించింది. జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మార్కెల్, బ్రిటిషు ప్రధాని థెరిసా మే, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ చేసిన సంయుక్త ప్రకటనలో ట్రంప్ ప్రకటన పట్ల విచారాన్ని వెలిబుచ్చారు. ఐరోపా మీడియా దీన్ని తీవ్రంగా ఖండించింది. వారు జెసిపిఒఎ కు కట్టుబడి వుండాలంటే ఇరాన్ ఐఎఇఎ తనిఖీకి అనుగుణంగా వ్యవహరించాలన్నారు. వాషింగ్టన్ లేవనెత్తిన అంశాల పరిష్కారానికి కృషిచేస్తామనీ, ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్స్ కార్యక్రమం, సిరియా, ఇరాక్ మరియు యెమన్‌లను అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్న దాని ప్రాంతీయ కార్యక్రమాల గురించి అమెరికా వెలిబుచ్చిన ఆందోళనలను తాము కూడా పంచుకుంటామని హామీ యిచ్చారు.

ఈ గందరగోళమైన దౌత్యభాష వెనుక వున్న డిమాండ్ ఒక్కటే. అదేమిటంటే అమెరికా, ఐరోపాల విదేశాంగ విధానానికి ఇరాన్ కట్టు బానిసలా పడి వుండాలి. వారు అణుకార్యక్రమ నిర్మూలనను మిస్సైల్స్‌కు కూడా వర్తింపచేయాలని కోరుకుంటున్నారు. ఆవిధంగా ఇరాన్ రక్షణ వ్యవస్థలోని ఒక ప్రధాన భాగాన్ని దానికి లేకుండా చేయడమే వీరి ఉద్దేశ్యం. ఇదంతా పాశ్చాత్య సామ్రాజ్యవాదుల మధ్య వారి ప్రయోజనాల కొరకు సాగుతున్న అపవిత్ర పొత్తు.

ఐరోపా సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి చేసే ప్రయత్నాలు అమెరికా సామ్రాజ్యవాదులకంటే తక్కువేమీ కాదు. వీరు ఇరాన్‌ను ఆర్థికంగా దోచుకోవాలను కుంటున్నారు. అందుకే వారు మధ్య ఆసియాలో జెసిపిఒఎ లాంటి సైనిక రాజకీయ జోక్యాలను చేసుకోడంలో అమెరికాతో చేతులు కలుపుతున్నారు. అయితే ఇక్కడే అమెరికా, ఐరోపా సామ్రాజ్యవాదుల ప్రయోజనాల మధ్య వైరుధ్యాలున్నాయి.

"ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఆంక్షల వల్ల బిలియన్ల విలువైన కాంట్రాక్టులు గాలిలో కలిశాయి" అని వీయోండే రాసిన వ్యాసంలో ఐరోపా యూనియన్ కార్పొరేటు సంస్థలు ఇరాన్‌లో నష్టపోతున్న కాంట్రాక్టుల జాబితాను పొందుపరిచాడు. ఎయిర్‌బస్ సంస్థ ఇరాన్‌కు జెట్ విమానాల రాకపోకలు లేకుంటే 10 బిలియన్ల యూరోలు నష్టపోతుంది. ఫ్రాన్స్ పెద్ద చమురు కంపెనీలు సౌత్ పార్స్ సహజవాయువు క్షేత్రాలను కోల్పోవడం వల్ల ఐదు బిలియన్ల యూరోల విలువైన కాంట్రాక్టులు కోల్పోతాయి. వోక్స్‌వాగన్ ఇరాన్‌లో తన కార్ల అమ్మకాలకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. పీగోట్ – సిట్రోన్ ఆటో తయారీ సంస్థకు ఇరాన్ మార్కెట్‌లో 39 శాతం గిరాకీ వుంది. రినాల్ట్ – నిస్సాన్ ప్రస్తుతం ఇరాన్‌లో ఏడాదికి 1,70,000 కార్లను అమ్ము కుంటుంది. అందుకే ఐరోపా సామ్రాజ్యవాదులు ఇరాన్‌లో తమకున్న ఇంత పెద్ద మార్కెట్‌ను వదులుకోడానికి సిద్ధంగా లేవు. ఈ పరిస్థితులే సామ్రాజ్యవాదుల మధ్య స్పర్థలకు, కుమ్మక్కులకు మూలం. అదే సందర్భంలో వీరు ఆసియా, ఆఫ్రికా మరియు లాటిన్ అమెరికా దేశాల ప్రయోజనాలకు ఎల్లప్పుడూ విఘాతం కల్గిస్తూనే వుంటారు.

సామ్రాజ్యవాదులు ఒప్పందంచేసుకోవడంగానీ, ఉల్లంఘించడం గానీ తమ స్వప్రయోజనాలపైనే ఆధారపడి వుంటుంది. అయితే దోపిడీ చేయడంలో తమ నాయకత్వాన్ని పరిరక్షించుకునే దానిలో భాగంగానే యిది వుంటుంది. సమీప గతంలో జరిగిన ఒక విషయాన్ని చూద్దాం. 2003లో లిబియాకు చెందిన మహమ్మద్ గడాఫీ సామూహిక హత్యాకాండకుపయోగించే ఆయుధాల తయారీ కార్యక్రమాల్ని ఆపివేయడానికి అంగీకరిస్తూ అమెరికాతో చేసుకున్న ఒప్పందంపై సంతకం చేశాడు. అయితే అమెరికా ఈ ఒప్పందాన్ని చించి పారేసింది. ఒప్పందాన్ని లిబియా ఉల్లంఘించినట్లు కనీసం ఒక్క సాక్ష్యాన్ని కూడా చూపలేదు. అధికారమార్పు కొరకు లిబియాపై యుద్ధాన్ని ప్రకటించింది.

మధ్య ఆసియాపై తమ ఆధిపత్యాన్ని స్థిరపరచుకోడానికీ, సహజ వనరుల – చమురును దోపిడీ చేయడం ద్వారా ఇరాన్‌ను లోబర్చుకోవడం కొరకు ఆర్థిక ఆంక్షల పేర ఇరాన్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడిని ప్రజానీకం తీవ్రంగా ఖండించాలి. తమ స్వాతంత్ర్యాన్ని, జాతీయ ప్రయోజనాలను రక్షించుకోడానికి ఇరాన్ ప్రజలు చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా వారి పక్షాన నిలవాలి.

ooooo